మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

హాస్టళ్లకు కంప్యూటర్ ల్యాబ్స్

- వందరోజుల ప్రణాళిక సమీక్షలో కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లాకలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులకు తెలిపారు. శనివారం వంద రోజులు లక్ష్యాల పురోగతిపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలు మొక్కుబడిగా ఉండకూడదన్నారు. ప్రజల అవసరాలకనుగుణంగా, విజన్ డాక్యుమెంట్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జనవరి 2025 నుండి మార్చి 2025 వరకు రూపొందించే తదుపరి 100 రోజుల ప్రణాళిక లక్ష్యాలు నిర్దేశించుకోవాలని కలెక్టర్ సూచించారు. సూర్యఘర్ పథకం అమలును విరివిగా ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ సిసి రోడ్ల పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.67 కోట్లతో 830 పనులను మంజూరు చేశామన్నారు. 725 పనులు ఇప్పటి వరకు గ్రౌండ్ అయ్యాయని, 105 పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనులను కూడా డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పుచ్చకాయలమాడ లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, సిపిఒ హిమ ప్రభాక్‌రాజు, జిల్లాఅధికారులు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. గూడు...



- నత్తనడకన సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- 50 రోజులైనా వంద రోజుల లక్ష్యంలో 11 శాతమే

గృహ నిర్మాణ శాఖలో నిర్లక్ష్యం గూడుకట్టుకుంది. ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. వంద రోజుల లక్ష్యం తీసుకుని 50 రోజులు పూర్తయినా పది శాతం లక్ష్యం కూడా చేరలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద రోజులకు గాను 10,534 ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా తీసుకోగా ఈ నెల 15 నాటికి 1230 ఇళ్లను మాత్రమే నిర్మాణం చేశారు. కర్నూలు జిల్లాలో 6,672 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 564 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. నంద్యాల జిల్లాలో 3,862 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 666 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇళ్ల నిర్మాణాల పురోగతిలో ఉమ్మడి జిల్లా పూర్తిగా వెనుకబడింది. ఉన్నతాధికారులు నిత్యం సమీక్షిస్తున్నా క్షేత్రస్థాయిలో పురోగతి కానరావడం లేదు. మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమం పేరుతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు, సచివాలయ ఇంజి నీరింగ్ అసిస్టెంట్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు.. ఇలా అందరూ సమన్వయంతో పని చేస్తే వంద రోజుల లక్ష్యం సాధించడం సాధ్యమే. లబ్ధిదారులను ఒప్పించడం.. పొదుపు మహిళలకు రుణాలు ఇప్పించడం.. ఇసుక కొరత లేకుండా చూడటం, ఆప్షన్ త్రీ కింద నిర్మాణా నిర్మాణాలు వేగవంతం చేస్తే లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోవచ్చు. కానీ సమన్వయ లోపంతో పనులు ముందుకు సాగడం లేదు. మరో ఆరు నెలలు గడిచినా వంద రోజుల లక్ష్యం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద రోజులకు గాను 10,534 ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా తీసుకోగా ఈ నెల 15 నాటికి 1230 ఇళ్లను మాత్రమే నిర్మాణం చేశారు. కర్నూలు జిల్లాలో 6,672 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 564 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. 50 రోజుల్లో 8.45 శాతం లక్ష్యం మాత్రమే చేరుకున్నారు. నంద్యాల జిల్లాలో 3,862 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 666 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. 50 రోజుల్లో 17.24 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. రోజుకు 105 ఇళ్ల చొప్పున కర్నూలు జిల్లాలో 6,672 గహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 50 శాతం ఇళ్ల నిర్మాణాలు ఆదోని డివిజన్లోనే జరిగాయి. మండలాలవారీగా పరిశీలిస్తే ఆదోని అర్బన్, ఆదోని రూరల్, ఎమ్మిగనూరు అర్బన్, కర్నూలు రూరల్, పత్తికొండ, హొలహర్వి, పెద్దకడుబూరు, ఆలూరు, కర్నూలు అర్బన్, కౌతాళం, దేవనకొండ, గోనెగండ్ల, కోసిగి, మండలాలు నిర్మాణాల్లో పూర్తిగా వెనుకబడి ఉన్నాయి. గూడూరు మండల పరిధిలో 14 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా నెలలో ఒక్క ఇంటి నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. హొలహర్వి మండలంలో 116 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా పెట్టుకోగా నెలలో కేవలం ఒక ఇంటిని మాత్రమే పూర్తి చేశారు. ఈ రెండు మండలాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు సుమారు 169 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయగలిగితే లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం రోజుకు 15 నుంచి 20 ఇళ్లు మాత్రమే పూర్తి చేస్తున్నారు. ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉంది. వీటిని కల్పించడంలోనూ మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి

జిల్లాలో వంద రోజుల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కొంత మేరకు సిబ్బంది కొరత ఉండటం వల్ల లక్ష్యాన్ని వేగంగా చేరుకోలేకపోతు న్నాం. వీలైనంత త్వరగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- చిరంజీవి, హౌసింగ్ పీడీ

19 నుంచి పారిశుధ్య

కార్మికులకు సన్మానం : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'హమారా శౌచాలయ హమారా సమ్మాన్'లో భాగంగా ఈనెల 19 నుంచి డిసెంబర్ 10 వరకు జిల్లా అంతటా పారిశుధ్య కార్మికులకు సన్మానం నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు. శనివారం ఆర్‌డబ్ల్యుఎస్, జిల్లా పరిషత్ సిఇఒ, పంచాయతీ రాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... 'హమారా శౌచాలయ హమారా సమ్మాన్' కార్యక్రమాలు 19న లాంఛనంగా ప్రారంభం కావాలన్నారు. 19న టాయిలెట్లు మంజూరైన వారందరికీ మంజూరు లేఖలు అందించాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి ఉత్తమ వ్యక్తిగత, కమ్యూనిటీ మురుగుదొడ్లకు బహుమతులను అందజేయాలని తెలిపారు. పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో, ఆస్పత్రుల్లో టాయిలెట్ల మరమ్మతులు ఉన్న వాటిని గుర్తించి మరమ్మతుల కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను నీటిని తనిఖీ చేయాలని, పారిశుధ్యంపై, బహిరంగ మల విసర్జనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఒడిఎఫ్ కోసం కృషి చేసిన వారిని ప్రత్యేకంగా సన్మానించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని, వారికి ముందుగానే ఆహ్వానాలు పంపాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ సిఇఒ, డ్వామా ఇన్‌ఛార్జీ పీడీ నాసర రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వర రావు, డిపిఒ భాస్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

- తెలియని లింక్‌లపై క్లిక్ చేయవద్దు - ఎస్‌పి బిందు మాధవ్
- సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు. శనివారం కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలోని పుల్లయ్య కళాశాల, రవీంద్ర ఇంజినీరింగ్ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో 'సైబర్ నేరాల'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ... రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కుటుంబాలకు, స్నేహితులకు సైబర్ నేరాల గురించి తెలియజేయాలన్నారు. చదువుకోని వారు, చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని తెలిపారు. కొరియర్ పేరుతో మోసాలు, చైల్డ్ ఫోర్నో గ్రఫీ, డిజిటల్ అరెస్టు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు మోసాలు, రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే రూ.10 కోట్లు ఇస్తామని, విడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లు మంచి కోసంఉపయోగించుకుంటే జీవితం సాఫీగా సాగి ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫోటోలను చూసి, ఆకర్షణకు లోనై మోసపోకూడదన్నారు. ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటే సైబర్ కేసులు ఎక్కువగా నమోదు కావన్నారు. యువత బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ లను సెట్ చేసుకుని సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే సంఘటన జరిగిన వెంటనే బాధితులు 1930 నెంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్ మాట్లాడుతూ అపరిచితుల కాల్స్ నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో రవీంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ శ్రీనివాసమూర్తి, పుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, పుల్లయ్య కాలేజ్ డీన్ ఆఫ్ అడ్మిన్ గిరిధర్, సిఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, శ్రీధర్ , పుల్లయ్య, రవీంద్ర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట ఫలితం..!

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం లభ్యత, పరిశోధన కోసం బోర్ల తవ్వకాల ప్రక్రియను ఆపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇక మీదట కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం బోర్ల తవ్వకాల అంశానికి సంబంధించి ఎలాంటి ప్రక్రియ కొనసాగదని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆ తరువాత యురేనియం బోర్ల తవ్వకాల ప్రక్రియ ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఈ నెల 14 వ తేదీన ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్సుకు ఈ మేరకు ఉత్త ర్వులు జారీ చేశారు. యురేనియం బోర్ల తవ్వకాల ప్రతిపాదనలకు సంబంధించి ఇకపై ఏ విధమైన చర్యలు తీసుకోవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, చెల్లెలి చెలిమల, నల్ల చెలిమిల, గుండ్లకొండ గ్రామాల పరిధిలో 468 హెక్టార్లలో అటవీ భూములున్నాయి. కౌలుట్లయ్యమలగా పిలిచే ఈ రిజర్వు ఫారెస్టు కప్పట్రాళ్ల, పి.కోటకొండ, మాదాపురం, చెల్లెలచెలిమిల, గుండ్లకొండ గ్రామాల మధ్య విస్తరించి ఉంది. అక్కడ 2018లో యురేనియం అన్వేషణ కోసం 20 బోర్లను తవ్వారు. తాజాగా అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్(ఎఎండి) 68 బోర్లు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఎలాగైనా యురేనియం తవ్వకాల అన్వేషణను అడ్డుకోవాలని, లేకుంటే తమకు ముప్పు తప్పదని భావించిన ఆయా గ్రామాల ప్రజలు తవ్వకాలను అడ్డుకునేందుకు ఆందోళనలు చేపట్టారు. అందులో భాగంగా కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ, నెల్లిబండ, దుప్పనగుర్తి, జిల్లేడుబుడకల, చెల్లెల చెలిమెల, బండపల్లి, బంటుపల్లి, కోటకొండ, బేతపల్లికి చెందిన జెఎసి నేతలు, 12 గ్రామాల ప్రజలు సమావేశమై యురేనియం తవ్వకాలను అడ్డుకోవాలని తీర్మానించారు. ఇప్పటికే కర్నూలు - బళ్లారి రహదారిపై రెండు సార్లు బైఠాయించి పోరుబాట చేపట్టారు. సిపిఎం నాయకులు కూడా గ్రామంలో సమావేశం నిర్వహించి యురేనియం ఆందోళనకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కర్నూలు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా యంత్రాంగం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో యురేనియం అన్వేషణ కోసం తవ్వకాలను చేపట్టవద్దని సిఎం ఆదేశించారు. యురేనియం వద్దంటూ గ్రామస్థులు చేసిన పోరాటం ఫలించింది.

అరకొర కేటాయింపులే

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.2.94 లక్షల కోట్ల ప్రతిపాదనతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు అన్యాయం జరిగింది. కొత్త ప్రాజెక్టుల ఊసే లేదు. కర్నూలు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీలిస్తున్నా బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు చేయలేదు. గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు మొత్తం 561.94 కోట్లను కేటాయించారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.26.30 కోట్లు, కెసి కెనాల్‌కు రూ.253.24 కోట్లు, ఎస్‌ఆర్‌బిసికి రూ.48.42 కోట్లు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు కోసం రూ.69.06 కోట్లు, హంద్రీనీవా సుజల స్రవంతి కోసం రూ.1867.75 కోట్లు కేటాయించారు. రాజమండ్రి, ఏలూరు, నంద్యాల వైద్య కళాశాలలకు రూ.221.81 కోట్లు కేటాయించగా నిర్మాణంలో ఉన్న ఆదోని వైద్య కళాశాల గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. విద్యా రంగానికి సంబంధించిన కేటాయింపుల్లో క్లస్టర్ యూనివర్సిటీకి రూ.1.40 కోట్లు, రాయలసీమ యూనివర్సిటీకి రూ.10.45 కోట్లు, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీకి రూ.1.50 కోట్లను కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. జిల్లాకు బడ్జెట్‌లో అరకొర కేటాయింపులే కేటాయించడం పట్ల జిల్లా వాసుల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

సమస్యలపై ప్రజాపోరు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ధరల భారాలు మోపుతుండగా మరో వైపు సమస్యలు పేరుకుపోతున్నాయి. అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యా చారాలు, విద్యుత్ ఛార్జీలు, వలసల నివారణ, రైతులకు గిట్టుబాటు ధరల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8 నుండి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు జోరుగా సాగింది. సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ, కరపత్రాలు పంచుతూ సిపిఎం నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. ప్రజాపోరులో భాగంగా గురువారం అన్ని మండల కేంద్రాలతో పాటు కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేపట్టారు.

రీసర్వే తప్పులను సరిచేయండి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూరీసర్వేలో బయటపడిన తప్పులను ప్రస్తుత కూటమి ప్రభుత్వం సరిచేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్ లో జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, సిఐటియు మండల కార్యదర్శి షాజహాన్‌లు విలేకరుల సమావేశం నిర్వహించారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో మండలంలో 12 గ్రామాల్లో సర్వే నిర్వహించారన్నారు. అందులో రైతుల భూములు అనేక మందివి తక్కువ ఎక్కువలుగా సర్వే నంబర్లు తప్పుగా వచ్చాయన్నారు. అప్పటినుండి రైతులు ఆవేదనతో చెప్పులరిగేలా మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, అయినా పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రిసర్వేలో జరిగిన అవకతవకలు సరిచేస్తామని హామీ ఇచ్చారన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పరిష్కరిస్తామని అన్నారని, ఇంతవరకు రైతుల భూములలో జరిగిన అవకతవకలను పరిష్కరించలేదన్నారు. మండలంలోని 12 గ్రామాలలో 819 మంది రైతులు వారి భూములు వివరాలు సరిగ్గా లేవని, సర్వే నెంబరు తప్పుగా ఉండటం విస్తీర్ణంలో వారికి ఉండాల్సిన భూమి లేకపోవడం వంటి అనేక రకాల తప్పులు ఉన్నాయని అన్నారు. కేతవరం గ్రామానికి చెందిన చిన్న కారు రైతు రెండు ఎకరాల పొలం ఉంటే 62 సెంట్లు మాత్రమే అతనికి ఆన్‌లైన్‌లో కనపడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి తప్పులు రీ సర్వేలో చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. వెంటనే తప్పులను సరి చేయకపోతే ఆర్‌డిఒ కార్యాలయాలన్ని రైతులతో ముట్టడిస్తామనిహెచ్చరించారు. రైతులు దస్తగిరి ఆంజనేయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెవివి జిల్లా అధ్యక్షులు బిడి.సుధీర్‌రాజు

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రంథాలయ వారోత్సవాలను సందర్భంగా శనివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బీడీ.సుధీర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వాటిల్లో పాల్గొంటే తమ ప్రతిభ చాటుకునేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖరకల్కూర తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా కాన్ఫెడరేషన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆల్ ఇండియా డ్రైవర్స్ కాన్ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడిగా కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. హర్యానా రాష్ట్రంలోని కార్నల్ జిల్లాలో జరిగిన ఆల్ ఇండియా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నూతన కమిటీకి సంబంధించి ఎన్నికలు నిర్వహించారు. ఎపి నుంచి నుండి పోటీ చేసిన వై.నాగేశ్వరరావు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు ఎపి రాష్ట్ర ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అసోసియేషన్ నాయకులు, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

- ఎస్‌పి బిందు మాధవ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా కేంద్రమైన కర్నూలు పట్టణంలో వాహనాల రాకపోకలు, జనసంచారం అధికమవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తిందని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సిసి కెమెరాల పనితీరును శనివారం పలు ముఖ్యమైన కూడళ్ళను కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆకస్మికంగా పరిశీలించారు. ముఖ్యమైన కూడళ్ళల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికపై ట్రాఫిక్ సిఐకు, ట్రాఫిక్ సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. కర్నూలులోని నగరంలోని పలు ముఖ్యమైన రద్దీ ప్రాంతాలైన సి.క్యాంపు, నంద్యాల చెక్ పోస్టు, గాయత్రి ఎస్టేట్ వై జంక్షన్, ఎన్టీఆర్ సర్కిల్ ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ రద్దీ సమస్య గురించి ఆరా తీశారు. సిఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, ట్రాఫిక్ ఆర్ఎస్సై హుస్సేన్ ఉన్నారు.

వెల్దుర్తి సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ తంగమని

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి తంగమణి

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం మహిళ న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశానికి డోన్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, లైంగిక వేధింపులను, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో మహిళలు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. చట్టాలు కల్పిస్తున్న రక్షణ గురించి మహిళలకు అవగాహన కల్పించాలని, మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు మహిళాన్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి ఎస్ఐ అశోక్, సీనియర్ న్యాయవాది గోపాల్‌రెడ్డి, అడ్వకేట్ ఎం. కుమారి, సిడిపిలు, మహిళలు పాల్గొన్నారు.

అవినీతి అక్రమాలకు పాల్పడితే వదిలిపెట్టం

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ (కుడా) గతంలో అవినీతి జరిగినా, ప్రస్తుతం అక్రమాలు జరిగినా ఎవ్వరి వదిలిపెట్టమని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గత 5 సంవత్సరాల కాలంలో కుడాకు ఎంత ఆదాయం వచ్చింది, ఇంకా ఆదాయం తీసుకురావాలంటే ఏం చేయాలో వంటి వివరాలను అదికారులతో చర్చించామని అన్నారు. శనివారం కుడా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ఎన్నో అవకతవకలు జరిగాయని, ఎన్నో అక్రమ లేవుట్లు వేశారని, లే అవుట్‌కు ఆన్‌లైన్ ద్వారా అప్రూవల్ చేయాల్సి ఉండగా పంచాయితీ సెక్రటరీలు తమ పరిధిలోని లేఔట్లకు ఆన్‌లైన్ అప్రూవల్ చేయించకుండా ఆఫ్‌లైన్ ద్వారా అప్రూవల్ చేయడం వల్లనే అక్రమ లేఔట్లు వేయడం సాధ్యమైందన్నారు. ఇది అరికట్టడానికి డిపిఒలతో చర్చించన అనంతరం పంచాయితీలను డివిజన్ల వారీగా ఏర్పాట్లు చేసి పంచాయితీ సెక్రటరీలకు అవగాహవన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో లేఔట్లు వేసి కుడా లేదా మునిసిపాలిటీలకు అప్పజెప్పాల్సిన రోడ్లను అప్పగించలేదని అన్నారు. అవగాహన సదస్సుల అనంతరం పంచాయితీ సెక్రటరీలకు వారం లేదా పది రోజులు సమయం ఇచ్చి అక్రమ లేవట్లను సరి చేసుకోవడానికి అవకాశం ఇస్తామని, అప్పటికీ వారు సరిచేయకపోతే మేమే ఫీల్డుకు వెళ్తామని అన్నారు. అవకవకలు జరిగినట్లు నిరూపణ అయితే తప్పులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు అన్ని వసతులతో అందుబాబులో ఉండేలా ఎన్‌టిఆర్ టౌన్ షిప్‌లో తక్కువ ధరలో పేదలకు ప్లాట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో బాగంగానే ఎమ్మిగనూరు, బవవాసి దగ్గర 110 ఎకరములు, ఆళ్ళగడ్డ దగ్గర 14 ఎకరాల 30 సెంట్లు, డోన్, బుగ్గానపల్లె దగ్గర 14 ఎకరాల 59 సెంట్లు భూమి తీశామన్నారు. బనవాసి దగ్గర వేసిన ప్లాట్లను అతి తక్కువ రేట్లకు అమ్మి రిజిస్ట్రేషన్లు కూడా చేశామన్నారు. ప్రజలు ఎవరైనా సరే తమకు స్థలం కావలన్నప్పుడు కుడా కార్యాలయాన్ని సంప్రదిస్తే అప్రూవల్ ఉన్న భూములను తక్కువ ధరకే ఇస్తారని, గత కుడా చైర్మన్ చేసిన కొన్ని అక్రమాలు తన దృష్టికి వచ్చాయని, వాటిపై విచారణ జరిపించాలని సిఎం నారా చంద్రబాబునాయుడును కోరతామన్నారు. గతంలో ఉద్యోగస్తులకు జీతాలు ఇచ్చే స్థితి కూడా లేదని అన్నారు. కొంత మంది డికె.ల్యాండ్ హంద్రీలో కూడా లేఔట్లు వేసారని, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయించి అమ్ముతున్నారని అన్నారు. భూములను కొనేవాళ్ళు ఆ భూమి గూర్చి పూర్తిగా విచారణ చేసి కొనాలన్నారు. సమావేశంలో కుడా అధికారులు సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.

కుడా కార్యాలయంలో మాట్లాడుతన్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు, సిఐటియు నాయకులు

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తుగ్గలి : ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు రంగస్వామి, ప్రతాప్, శ్రీనివాసులు, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వైద్యులు ప్రవీణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల నాయకులు,నాగమ్మ, శకినాబీ, కాంతమ్మ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయ కుండా కాల యాపన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అయినా ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆశా వర్కర్ యూని యన్ రాష్ట్ర ప్రతినిధి బృందంతో జరిగిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలపై జీవో విడుదల చేయాలని కోరారు. ఈనెల18న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాకు ఆశ వర్కర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేలకొరిగిన వరి పంట

అకాల వర్షం...

- నేలకొరిగిన పంటలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అకాల వర్షం అన్నదాతలను నట్టేట ముంచింది. గురువారం మండలవ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల వరి పంటలు నేలకొరిగాయి. అన్నదాతలకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం, సంతేకుడ్లూరు, మదిరె తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, జొన్న, సజ్జ పంటలు నేలవాలాయి. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ ప్రభావం వల్ల వర్షం ముంచుకొచ్చి తమను నట్టేట ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోతకుకొచ్చి ఉంటే ఎకరాకు 40 బస్తాల వరి దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం వర్షం ప్రభావంతో కనీసం 5, 6 బస్తాలు కూడా దక్కడం కరువేనని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

- అడిషనల్ పీడీ మాధవి లత

ప్రజాశక్తి - ఆలూరు

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అడిషనల్ పీడీ

ఉపాధి హామీ చట్టం అనుబంధ శాఖల్లో జరిగిన పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి అడిషనల్ పీడీ ఎస్.మాధవి లత హెచ్చరించారు. శనివారం ఉపాధి కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. మార్చి 1, 2023 నుంచి నవంబర్ 31, 2024 ఉపాధి హామీ, హౌసింగ్, పంచాయతీ రాజ్, పశుసంవర్ధక శాఖలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీ నిర్వహించిన రికార్డులను పరిశీలించారు. డిఇఒ లోకేష్, ఏపీడీ పద్మావతి, ఎపిఒ శ్రీనివాసులు, ఇసి మారెన్న, పిఆర్ ఎఇ చౌడ రెడ్డి, ఎంపిపి తనయుడు జె.వీరేష్, మొలగవల్లి సర్పంచి మోహన్ రాజు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కోసం కృషి

- ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ కుమారస్వామి

ప్రజాశక్తి - కౌతాళం

నివాళులర్పిస్తున్న అధికారులు

గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పని చేద్దామని ఎంపిడిఒ సుబ్బరాజు, తహశీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాలాభివృద్ధికి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు ఇలాంటి మౌలిక సదుపాయాలు కావాలో, ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేసి ముందుకు సాగాలన్నారు. వైస్ ఎంపిపిలు రామలింగేశ్వర స్వామి, లిఖిత, అధికారులు శేషాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జగదీష్ బాబు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బాలమురళీకృష్ణ, డాక్టర్ ఇమ్మానుయేల్, డాక్టర్ కిరణ్, శ్రీనివాసరెడ్డి, మాధవ్ శంకర్, అఖిల, కార్యాలయపు పరిపాలన అధికారి సత్యన్న, రిసోర్స్ పర్సన్ సునీత, కోఆర్డినేటర్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు శివప్ప, యోగేశ్వర్ రెడ్డి, అబ్దుల్ వహీద్, అబ్దుల్ కరీం, వెంకటేష్, మంజునాథ్, విక్రం కుమార్, ఆంజనేయులు, హుస్సేనమ్మ, బసవరాజు, జూనియర్ అసిస్టెంట్ ప్రమీల, కంప్యూటర్ ఆపరేటర్ సలీం బాషా పాల్గొన్నారు.

'ఆవాజ్ గ్రామీణ యోజన'కు మాచాపురం

- ఎంపిడిఒ పుల్లారావు

ప్రజాశక్తి - నందవరం

మాచాపురం గ్రామాన్ని సందర్శిస్తున్న అధికారులు

మండలంలోని మాచాపురం గ్రామం ప్రధానమంత్రి ఆవాజ్ గ్రామీణ యోజన పథకానికి ఎంపికైనట్లు ఎంపిడిఒ పుల్లారావు తెలిపారు. ఎంపిడిఒ, ఇఒఆర్‌డి సందీప్, పంచాయతీరాజ్ అధికారి నరసింహులు శనివారం మాచాపురం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ప్రధానమంత్రి ఆవాజ్ గ్రామీణ యోజన పథకం కింద గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయిన్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పల్లె పండగ ప్రోగ్రాంలో రూ.10 లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డు పనులను పరిశీలించారు. అలాగే రైతు సేవా కేంద్రం పనులను, హెల్త్ క్లినిక్ భవనాల పనులను పరిశీలించారు. టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీంవలీ, పంచాయతీ కార్యదర్శి పెద్దరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు డమ్మీ..!

- కొత్త రకం దోపిడీకి 'కూటమి' స్కెచ్

- వెండర్ విధానంలో పనుల కేటాయింపు

ప్రజాశక్తి-ఆదోని రూరల్

కూటమి నేతలకు దోచి పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కొత్త విధానాలను తెరపైకి తెస్తోంది. వారి కళ్లు ఉపాధి పనులపై పడ్డాయి. అధికారాన్ని అడ్డు పెట్టుకుని కిందిస్థాయి నాయకుల జేబులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది...

ఉపాధి హామీ నిధులతో జరిగే సిమెంట్ రోడ్ల పనులకు పంచాయతీ తీర్మానం అవసరం కావడంతో పలువురు సర్పంచులు కూటమి నేతలకు భయపడి వారికే పనులు కేటాయిస్తూ తీర్మానాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే కార్యాలయం

ఎమ్మెల్యే పార్థసారథికి మొరపెట్టుకున్న సర్పంచులు (ఫైల్)

నుంచి టిడిపి, జనసేన, బిజెపి నేతలతో పనులు చేయించాలని ఆదేశాలు ఇచ్చారని సర్పంచులు వాపోతున్నారు. ఈ విధానం పూర్తిగా ఉపాధి హామీ నిబంధనలకు విరుద్ధం. సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిల్లో వైసిపికి చెందిన వారే అధికంగా ఉన్నారు. నిబంధన మేరకు ఉపాధి హామీ పనులు సర్పంచుల ద్వారానే జరగాలి. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల అధికారాలను పక్కనపెట్టి కూటమి పార్టీలకు చెందిన వారికి 'వెండర్' పేరుతో దోచి పెట్టేందుకు చర్యలు తీసుకుంది. 2014లో ఉన్న జన్మభూమి కమిటీ తరహాలో ఇప్పుడు వెండర్ (కాంట్రాక్టర్) విధానం తెరపైకి తెచ్చింది. దీని పేరుతో కూటమి నేతలే పనులు చేసేందుకు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. తమ హక్కులు కాలరాసేలా కూటమి ప్రభుత్వం చేస్తున్న పనులపై సర్పంచులు, ఎంపిటిసిలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రూ.2 కోట్లతో పనులు

ఆదోని మండలంలోని వివిధ గ్రామాలకు సిమెంట్ రోడ్లు, కాలువలు, పశువుల షెడ్ల నిర్మాణం కోసం ఉపాధి హామీ చట్టం కింద నిధులు మంజూరయ్యాయి. ఆ పనులను కూటమి ప్రభుత్వం తమ పార్టీ నేతలకు కట్టబెడుతోంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపిటిసిలను పూర్తిగా విస్మరించి గ్రామ స్వరాజ్యాన్ని అపహాస్యం చేశారనే

మండిగిరి గ్రామంలో జరుగుతున్న పనులు

విమర్శలున్నాయి.

మొరపెట్టుకున్నా వినని ఎమ్మెల్యే

గతనెల 16న స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం అనంతరం సర్పంచులంతా కలిసి రాతపూర్వకంగా ఎమ్మెల్యే పార్థసారథికి వినతిపత్రం అందిస్తూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచులకు కేటాయించాలని మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... 'సర్పంచులు పార్టీలో చేరండి.. పనులు చేసుకోండి..' అంటూ ఆఫర్ ఇచ్చారు.

వెండర్స్‌కు అప్పగించడం చట్టవిరుద్ధం

- కె.ఉమాదేవి, పాండవగల్ సర్పంచి

ఉపాధి పనులు సర్పంచులకు కాకుండా వెండర్స్‌కు అప్పగించడం చట్ట విరుద్ధం. ఈ పనులు సర్పంచుల ఆధ్వర్యంలోనే జరగాలని ఉపాధి హామీ చట్టంలో స్పష్టంగా ఉంది. వెండర్స్‌కు పనులు అప్పగించడమంటే సర్పంచుల హక్కులు కాలరాయడమే...

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

శ్రీనివాసులను పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

విద్యార్థుల సమస్య పరిష్కరించాలంటే అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడలో మహా ధర్నాకు పిలుపు ఇవ్వడం తెలిసిందే. పోలీసు యంత్రాంగాన్ని వినియోగించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ నాయకులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడం దారుణమన్నారు. శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులును ఆదోని వన్‌టౌన్ పోలీసులు బహిరంగ ప్రదేశంలో అరెస్టు చేసి బైక్‌పై స్టేషన్‌కు తరలించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ... అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి 'చలో విజయవాడ'

విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 18న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. శనివారం ఆదోనిలోని సిఐటియు కార్యాలయంలో గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన విడుదల చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందన లేకపోవడంతోనే విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న విజయవాడ ధర్నాచౌక్‌లో 'మహాధర్నా'కు పూనుకున్నామన్నారు. విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సూరి, కార్యదర్శి గౌస్, నాయకులు లోకేష్, గణేష్, శశిధర్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి జరిగితే సహకరిస్తాం

- టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

మండల ప్రజలకు మంచి జరిగితే పార్టీలకతీతంగా టిడిపి నాయకుల సహకారం ఉంటుందని టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపిటిసి ఉచ్చీరప్ప, టిడిపి నాయకులు ఆకుల వీరేష్, రామారావు నాయుడు, మలకన్న, వెంకటస్వామి గౌడ్ తెలిపారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియం తవ్వకాల గురించి ప్రజల్లో అపోహలను తొలగిస్తూ ప్రభుత్వం ఒక మెమో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు శ్యామ్ కుమార్, దస్తగిరి, టిడిపి కోడుమూరు ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డి, ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలూరు వైసిపి ఎమ్మెల్యే విరుపాక్షి చేసిన ఆరోపణలను నిరాధారమైనవని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఎటువంటి సమాచారం లేకున్నా ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని తెలిపారు. ఏమైనా ఉంటే ప్రజలకు మేలుచేయాలని, కీడు చేయకూడదని హితవు పలికారు. రాబోయే రోజుల్లో ప్రజల తరపున టిడిపిగా పోరాటం చేస్తామన్నారు. టిడిపి నాయకులు బండిగింజల రంగన్న, అలారుదిన్నె మల్లయ్య, కరివేముల గిడ్డయ్య, వెంకటస్వామి గౌడ్, నెల్లిబండ మల్లికార్జున, రాజుగోపాల్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, మల్లేపల్లి రంగుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున, మస్తాన్, డీలర్ బండ్లయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయ భాస్కర్ గౌడ్

వ్యవసాయ సహాయకులు శివారెడ్డిని సస్పెండ్ చేయాలి

రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న శివారెడ్డి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని చూడి గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు శివారెడ్డిని సస్పెండ్ చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ... కౌతాళం మండలాన్ని కరువుగా ప్రకటించడంతో రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను వ్యవసాయ శాఖ సహాయకులకు అందజేయాలని తహశీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపారని అన్నారు. రైతులు జిరాక్స్ కాపీలను అధికారికి అందించడానికి వెళితే డబ్బులు రూ.200 డిమాండ్ చేయడం తగదన్నారు. 'మీకు కరువు డబ్బులు రావాలంటే.. నాకు కొంత చెల్లించుకోవాల'ని రైతులను ఇబ్బందులు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారి డబ్బులు వసూలు చేస్తున్న వీడియోను రైతులు చిత్రీకరించి మండల అధికారులకు పంపించినట్లు తెలిపారు. గతంలోనూ ఈ-క్రాప్ బుకింగ్ కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేశారని గుర్తు చేశారు. రైతులను ఇబ్బందులు గురిచేస్తున్న శివారెడ్డిని సస్పెండ్ చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎఒ శేషాద్రిని కోరగా... ఆ వీడియోలు తన దృష్టికి వచ్చాయని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిపినట్లు చెప్పారు. రైతులు ఎలాంటి జిరాక్స్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి రైతు బ్యాంకు ఖాతాకు ఎన్‌పిసిఐ లింకులు చేసుకోవాలని కోరారు.

వలస వెళ్లొద్దు.. ఉపాధి కల్పిస్తాం : ఎపిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లొద్దని, ఉన్న దగ్గరనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఎపిఒ జుబేర్ అహ్మద్ తెలిపారు. శనివారం రామదుర్గం గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి ప్రజలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడ పనులు లేవని ఎవరూ అనుకోవద్దని, అందరికీ పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వలసలు వెళితే ఇంటి దగ్గర పిల్లలకు, వృద్ధులకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. వలస వెళితే పిల్లలు కూడా పాఠశాలలకు సరిగా వెళ్లకుండా ఉంటారన్నారు. పిల్లలను చదువుకు దూరం చేయవద్దని, చదువులో రాణించేలా పిల్లలకు బాధ్యత నేర్పాలని సూచించారు. ఉపాధి హామీ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనమివ్వాలి

- 18న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

- యూనియన్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శివలక్ష్మి, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. శనివారం ఆశావర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశావర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. రెండేళ్లకోసారి పెంచాల్సిన వేతనాలను పట్టించుకోకపోగా, ప్రభుత్వ పథకాలు చేరవేసే ఆశా, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజనం వర్కర్లకు మొండి చేయి చూపిందన్నారు. ఆశా వర్కర్లకు కనీసం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. పని భారం తగ్గించాలని, ప్రభుత్వ, మెడికల్ సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న చలో కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నామని, ఆశాలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆశావర్కర్లు లింగమ్మ, విశాలాక్షి, శారద, రామేశ్వరి, లలిత, శ్రీదేవి, రంగలక్ష్మి, కృష్ణవేణి, షబానా, లక్ష్మి నరసమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆలూరు : ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శనివారం కమ్మరచేడు పిహెచ్‌సిలోని డాక్టర్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి ఆశావర్కర్స్ యూనియన్ మండల నాయకులు ఆరోగ్య మేరీ, సుభాషిణి, అరుణ, సరస్వతి మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేసిందని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఎన్‌సిడి సర్వేలు రద్దు చేయాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా ప్రమోట్ చేయాలని, పని భారం తగ్గించి రూ.10 లక్షల గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈనెల 18న కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నాకు మండలంలోని ఆశాలు హాజరయి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కృష్ణ, షాకీర్ పాల్గొన్నారు.

ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎపిఒగా బజారప్ప

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం ఎనర్జీస్ ఎపిఒగా బజారప్ప బాధ్యతలు చేపట్టినట్లు ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ... కోసిగి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎపిఒగా మాధవ శంకర్ విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో ఎపిఒగా బజారప్ప బాధ్యతలు చేపట్టడంతో ఇద్దరు ఎపిఒలుగా విధులు నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో ఇద్దరు ఎపిఒలుగా ఉన్న మండలం కౌతాళం నిలిచింది.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండ గ్రామానికి చెందిన ఉప్పర మాధవ లక్ష్మి (45) శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన ఉప్పర నరసింహులు భార్య మాధవ లక్ష్మికి గత కొంతకాలంగా కడుపునొప్పి ఉంది. శనివారం నొప్పి భరించలేక పురుగుమందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్య అధికారి పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

ప్రజాశక్తి - హోళగుంద

కోలుకోలేక మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని గజ్జహల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఈనెల 14న కురువ కుబేర స్వామి భార్య అనసూయ గజ్జహల్లి గ్రామంలో మిరప పొలంలో కలుపు తీసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం పొలంలో ఆమె మీద పిడుగు పడింది. చికిత్స నిమిత్తం ఆమెను కర్నూలులోని ఓమ్ని హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందారు. ఆమె భర్త కుబేర స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మాట్లాడుతున్న నాయకులు

మహాధర్నాను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ కోరారు. శనివారం గోనెగండ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయి ఉదయ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రంగస్వామి మాట్లాడారు. వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, డిగ్రీ నాలుగేళ్ల విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో తల్లిదండ్రులు వలసలు వెళ్లే సమయంలో సంక్షేమ వసతి గృహం లేకపోవడంతో డ్రాపౌవుట్లు పెరిగిపోతున్నాయని, సమస్య పరిష్కారానికి జిల్లా యంత్రాంగం గోనెగండ్లలో సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గోనెగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.లక్షల విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శీను, ఓంకార్, రియాజ్, వినయ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు సురేష్

ప్రజాశక్తి - ఆదోని

వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆత్మీయ సమ్మేళన వనమహోత్సవాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ కోరారు. శనివారం జేబీ



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పట్టణ అధ్యక్షులు ఎం బొబ్బిలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 29న మాలల ఆత్మీయ సమ్మేళన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి మాల బంధువులందరూ ఆహ్వానితులేనని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీలకు జరిగే అన్యాయ, అక్రమాలను ఎదుర్కోవడానికి మాలలు సిద్ధంగా ఉండాలని కోరారు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, మాలమహానాడు నాయకులు నీలకంఠ, మండల అధ్యక్షులు నరేష్ కుమార్, మాల మహానాడు ఆదోని డివిజన్ యూత్ అధ్యక్షులు అరవింద్, యూత్ మండల అధ్యక్షులు మరకట్టు కృష్ణ, విద్యార్థి విభాగం అధ్యక్షులు గిరి, జగదీష్ పాల్గొన్నారు.

కార్యకర్తలే వెన్నెముక

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

సభ్యత్వం ఇస్తున్న గుడిసె ఆది కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

టిడిపికి కార్యకర్తలే వెన్నెముక లాంటి వారిని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. శనివారం ఆమె స్వగృహంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చంద్రబాబు ఆదేశాల మేరకే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమ వంతు భాగంగా సభ్యత్వ నమోదు చురుకుగా చేయిస్తున్నామని తెలిపారు. ఆలూరు మాజీ జడ్‌పిటిసి రాంభీమ్ నాయుడు, కపటి మాజీ సర్పంచి మాధవ్ ఇతరులకు సభ్యత్వం, సభ్యత్వ రెన్యువల్ చేయించారు.

టిడిపితోనే కార్యకర్తలకు భరోసా

సభ్యత్వం తీసుకున్న నాయకులు, కార్యకర్తల అనంతరం కూడా ఆర్థిక భరోసా కల్పిస్తూ కుటుంబ సంక్షేమం చూసే ఏకైక పార్టీ టిడిపి అని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అప్సర్ బాష తెలిపారు. ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని విక్టోరియా పేటలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇక్బాల్, మాబాష, డిష్ బాష, సాదుల్లా, గౌస్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయాలని, రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ నాగన్న డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, డిప్యూటీ తహశీల్దార్ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్దాల తరబడి రాయలసీమ అన్యాయానికి, వివక్షతకు గురవుతూనే ఉందని తెలిపారు. పాలకులు మారుతున్నా, రాయలసీమ పరిస్థితి మారడం లేదన్నారు. కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలు తగ్గడం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రజలు ఉద్యమిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని తెలిపారు. శ్రీబాగ్ ఒప్పందం కుదిరిన నవంబర్ 16న రాయలసీమ హక్కుల ఉల్లంఘన దినంగా సీమ ప్రజలు జరుపుకోవాలని చెప్పారు. విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు బతకన్న, సంజీవ్, శేఖర్, వీరేష్ యాదవ్, ఖాజా, మహేంద్ర, కృష్ణ, సురేంద్ర, వెంకటేష్, నాగరాజు, అఫ్రీద్ పాల్గొన్నారు.

'ఆయిల్ ఫాం' లాభదాయకం

- మలేషియా, ఇండోనేషియా శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఆయిల్ ఫాం పంట రైతులకు లాభదాయకమని మలేషియా, ఇండోనేషియా శాస్త్రవేత్తలు ఫాన్సస్ నికోలస్, విజయన్, ఆయిల్ ఫాం డైరెక్టర్ రంగనాయకులు తెలిపారు. పెద్దకడబూరులో తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత రెడ్డి ఫాంలో సాగు చేస్తున్న ఆయిల్ ఫాం పంటను శనివారం వారు ఎఒ వరప్రసాద్ ఆధ్వర్యంలో పరిశీలించారు. మొక్కలు పెంచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట సాగు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మాజీ ఎంపిపి నరవ శశిరేఖ, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఎపిఒ రాఘవేంద్ర, అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

విద్యా కమిటీ ఎన్నికలు జరపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ ఎన్నిక జరపాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రంగప్ప, అబ్దుల్లా కోరారు. ఆగస్టు 8న జరగాల్సిన ఎన్నికలు రాజకీయ కారణాల వల్ల వాయిదా వేస్తున్నారని చెప్పారు. శనివారం విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేసి సమస్యలు లేని పాఠశాలను తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా కమిటీ ఎన్నికలు జరుపుతోందని తెలిపారు. కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రం దానికి భిన్నంగా రాజకీయంగా ఎన్నికల జరుగుతున్నాయని చెప్పారు. ఆగస్టు 8న పూర్తి కావాల్సిన ఎన్నికలు దశలవారీగా రెండు పర్యాయాలు వాయిదాలు వేస్తూ నేటి వరకు నిర్వహించలేదన్నారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు ద్వారా చేపట్టిన నిర్మాణాలు ఆగిపోవడం వల్ల ఆ పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులు సరైన తాగునీరు, తగినన్ని మురుగుదొడ్లు, తరగతి గదుల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు ఏమాత్రం విద్యార్థుల గురించి ఆలోచించడం లేదన్నారు. పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి, పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులను కలుపుకొని నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

ఏకసభ్య కమిషన్ అభినందనీయం

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాట్లాడుతున్న చిక్కం జానయ్య మాదిగ

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ తెలిపారు. శనివారం పట్టణంలోని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉప కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు 30 ఏళ్ల నుంచి ఎన్నో పోరాటాలు చేశారని, ఎంతో మంది అమరులయ్యారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను జనాభా ధామాషా పద్ధతిన ఆయా రాష్ట్రాలు చేసుకోవాలని ఆగస్టు 1న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యూనిట్ కేంద్రాలుగా పంపించి, విశ్రాంతి ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాతో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగుల్లో సంపన్న వర్గాలకు క్రిమిలేయర్ అమలు చేస్తే, కోట్ల సామాన్య దళిత, గిరిజనులు లబ్ధి పొందుతారని చెప్పారు. కులవివక్షత, అంటరానితనం, పేదరికం పోతుందని తెలిపారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నందవరం మండల అధ్యక్షులు శావల బుజ్జిబాబు మాదిగ, మండల ఇన్‌ఛార్జీ చింపిరి చిన్నపోతప్ప మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి శావల శాంతిరాజు మాదిగ, మండల కన్వీనర్ శావల సత్యానందం మాదిగ, పెద్దకడబూరు మండల అధ్యక్షులు మంచోది ఆదాము మాదిగ, మండల నాయకులు మంచోది ఆనంద్ పాల్గొన్నారు.

'గ్రంథాలయాలతో మేధోశక్తి పెంపు'

ప్రజాశక్తి - నందవరం

గ్రంథాలయాలు విద్యార్థుల మేధో శక్తిని పెంపొందించడానికి దోహదపడతాయని గ్రంథాలయ అధికారి శివరామ ప్రసాద్ తెలిపారు. శనివారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమ నిర్మాతలు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం, వెలగా వెంకటప్పయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు దేశంలో గ్రంథాలయ ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారని తెలిపారు. గ్రామస్తులు, విద్యార్థులు గ్రంథాలయంలో దొరికే పుస్తకాలను చదవాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

జిల్లా మహిళ మరియు శిశు అభివృద్ధి మరియు సాధికారిత అధికారిణి కార్యాలయం కర్నూలు

షార్ట్ టెండర్ నోటిఫికేషన్

ఆర్.సి. నెం. 100/2024/ICDS(146AWC)/SA DATE: 16.11.2024

కర్నూలు జిల్లా పరిధిలో (9) ICDS ప్రాజెక్టులో గల సాక్ష్యం అంగన్వాడీ కేంద్రముల DIY toy Kits for play based Pedagogy, Sishu Desks, Imaginative play/art & craft corners, BALA (Building as Learning Aid) Paintings కొనుగోలు చేయునిమిత్తము షార్ట్ టెండర్ కోరబడుచున్నవి. కావున ఆసక్తి గలవారు జిల్లా మహిళ మరియు శిశు సంక్షేమం మరియు సాధికారత అధికారి వారి కార్యాలయం, రూమ్ నెం.122, కలెక్టర్ కాంప్లెక్స్, కర్నూలు నందు తేది. 18.11.2024 నుండి టెండర్ దరఖాస్తును రుసుము రూ. 10000/- డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా చెల్లించి పొందగలరు. నిర్దేశించిన టెండరు దరఖాస్తుకు అవసరమగు ధ్రువపత్రములను జతచేసి 24.11.2024 సాయంత్రం గం.03.00 లోపు సమర్పించగలరు.

సం/- శ్రీమతి బి. నవ్యా, ఐ.ఏ.యస్. సంయుక్త కలెక్టర్ & ఛైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ, కర్నూలు జిల్లా.